# ఉరికంబం

రచన: పార్వతీశం

ఉరికంబంమాట తలచుకొనేటప్పటికి గుండె గుభేలుమన్నది ఒక్కసారి. సోదర మానవులు బలవంతాన మానవుడనైన నా మీద కక్ష్యకట్టి అంతఅన్యాయంచేస్తారని ఎన్నడూ అనుకోలేదు. అయినా నేనుచేసిన అత్యాచారం ఏమీలేదు. సరిగా ఆలోచిస్తే సరిగ్గా ఆలోచించేమాటుంటే అసలు ఉరితీయటమనే మాట వస్తుందీ... చేసినపనైతేహత్యే! అంత వరకూ నేనూ అంగీకరిస్తున్నాను. హత్యలో తారతమ్యంలేదూ? ఏనుగుని చంపినా, ఎలుకనుచంపినా రెంటికీ హత్య అని ఒకే పదం వాడటం యేమంత సబబు చెప్పండి.

మందగించిన మదీయ శరీరానికి కాస్తంత కండ పట్టిద్దామని బుద్ధిబుట్టింది. పప్పు దినుసులు తిను, పాలు తాగు, వీలుగా వుంటే పచ్చిగోంగూర తిను (దాంట్లో ఇనుం - తెలుగులో ఐరన్ అంటారు_వుంటుందట)అంటూ మా శాస్త్రుల్లుబావ నిన్నపొద్దున చెవికింద జోరీగలా రొదపెట్టినా విదిలించికొట్టానేగాని ఆవగింజంత శ్రద్ధయినా చూపించానా? కర్మను తప్పించటం, ఆకర్మనువ్రానే బ్రహ్మగాడికే తప్పలేదుట. అందరి కర్మలు పొద్దుకూకులు రాయడం కర్మ కాకపోతే మరేమిటి చెప్పండి. ఛత్! అయిన వాడిమాట వినటం ఏమిటని డాక్టరుదగ్గరకుపోతే వాడి దుంపతెగ కోడిగుడ్లు తింటే కండబడుతుందని చెప్పాడు, ఆ సలహాయేగా యింతవరకు తెచ్చింది. అంతటితో ఆగక దాంట్లో ఏవో విటమిన్లు చాలా వున్నాయట, ఆ విటమినులన్నీ కొనటానికి మనదగ్గిర విటమిను 'యం' వుండాలికదా-అందుకని గుడ్డు తీసుకోవటమే వీలంటాడు! ఆ ఖర్చుగూడా తగ్గాలంటే కోడిని వకదాన్ని పెంచమంటాడు. పక్షే అని. నా వంశగౌరవం అంతా ఈ వెధవ వైద్యంకోసం కోడిపాలు చేయమంటాడు. గుడ్డులో కొవ్వుగూడా వుందట. తాను తిని చూశాడుట_ఆ కొవ్వు ఎక్కినమాటలుగావు యివన్నీ ... ఆ...?

వాడెన్నిమాటలుచెప్పినా నా బ్రతుకు తెరువు చూచుకోవాలిగదా. వంటికి బలం లేందే యింటికి బలగంవచ్చేది ఎట్లా మరి? పచ్చిగోంగూరఅయినా తినాలి, గుడ్డునన్నా తినాలి. ఈమధ్య మావాడువకడు కండకోసం పచ్చి గోంగూర పట్టించాడు. దానితర్వాత పేరు మనిషికితగ్గట్లు వుండాలనే సదుద్దేశంతో వాడిపేరు మావాళ్ళంతా కలిసి ఎలిఫెంటు శాస్త్రుల్లుగా మార్చారు. వాడిమాట జ్ఞాపకం వచ్చి వళ్ళంతా ఎలుకలు పాకినట్లయింది. గుడ్డును తీసుకోవటంతప్ప గత్యంతరం లేదనిపించింది.

వెంటనే మా పెరుగు బాపమ్మను ఈ విషయమై కదిలిస్తే గుడ్లు చౌకగా ఏరోజు కారోజువి_రోజూ గుడ్డుపెట్టేకోడి అదెంతకండగలదో యిస్తానని వాగ్దానంచేసింది. అన్నీ కలిసిరావటంవలన పొద్దున్నే గదిలో ఎవరూ లేకుండాచూసి గుడ్డు పగలకొట్టటానికి సన్నద్ధుడనయ్యాను. గుడ్డు చేత్తోముట్టుకుని కొద్దిగా నొక్కిచూచాను. మహా గట్టిపిండంలాగా వుంది. రెండువేళ్లమధ్య నొక్కి గారడీవాడు పగలగొట్టినట్లు పగలగొడదామని ఆలోచన కలిగింది. వెంటనే గాజుగ్లాసుతీసి చేతికింద పెట్టి ఎంతనొక్కినా దానియమ్మ కడుపు బంగారంగాను (బంగారమైనా బాగుండేది) అది ఎంతకీ పగలందే! నా చిన్న బుర్రకి ఒక అసమానమైన ఆలోచనతట్టింది. ఒక చివర చిన్న చిల్లుచేసి కొబ్బరినీళ్ళలాగా గ్లాసులో పోసుకుని తాగుదామనుకున్నాను. చిల్లుపడిందిగాని కొబ్బరినీళ్లులా ఏమీ కారలేదు. దానితో వ్యథచెంది బలవంతాన నేల కేసికొట్టాను దాన్ని. కళ్లు మిరుమిట్లుకొలిపే టట్లు ఒక పెద్దవెలుగు...ధగధగా...అంతా ఒక్కసారి ఆరిపోయింది. పగిలిన పెంకులలో నుంచిచూస్తుండగానే ఎర్రటివస్తువొకటి కోడిపిల్ల ఆకారంగా మారింది. పెరిగి పెద్దవుతోంది. నాగుండె నామాట వినిపించుకోవటంలేదు. పెరిగి పెద్దదయినకోడి వక్కసారిగా మనిషిరూపందాల్చి కిందపడిపోయింది. నా కళ్ళను నేనే నమ్మలేనప్పుడు నేను చెప్పే మాటలు యింకోళ్ళు ఎలా నమ్ముతారు. గది అంతా రక్తమయం. పడినవ్యక్తి తలపూర్తిగా చితికిపోయివుంది. గుర్తుపట్టటానికి యముడికి గూడ చేతకాలేదనుకుంటాను. అందుకనే వాడిప్రాణాలు తీయలేదు. చచ్చిగూడా మాట్లాడుతున్నాడు. నేనే చంపానుట వాణ్ణి!

చచ్చుసాక్ష్యం వాడూను. చచ్చినవాడు ఎలాగూ చావనేచచ్చాడు. తిరిగి ఈ ధోరణి ఏమిటి? చూస్తుండగానే జనం పోగయ్యారు, తలోమాటా_నేనే చంపానుట. చవట నేనెందుకు చంపుతాను? నాకేం అవసరం? నేను చంపలేదనిచెబితే చచ్చినవాడు వచ్చినట్లువూరుకోక నేనుచంపినట్లు సాక్ష్యంచెప్తున్నాడు. నాలోని నైతిక విలువలన్నీ పూనగొట్టుకుని ఎంతప్రాధేయపడ్డా వినేదేవుడు కనబడలేదు. ఇదంతాచూస్తే వక్కసారి హఠాత్తుగా చస్తే బ్రతికిపోదునుకదా అనిపించింది.

నాగోల నాదగ్గిరే అట్టేపెట్టి బలవంతాన రావిచెట్టుకింది పెద్దలంతా ఉరిశిక్ష నిర్ణయించడంచూస్తే వొళ్లు మండిపోయింది. ఎలాగో ఉరిశిక్ష ఖాయం అయింది కాబట్టి యింకా నలుగుర్ని చంపిపోతే సరిపోతుందిగదా అనిపించింది. ఒకర్నిగూడా చంపనందుకే ఉరితీస్తుంటే నలుగుర్ని చంపితే నన్నేంచేస్తారో అని భయంవేసి వూరుకున్నాను.

బలవంతాన యిద్దరు మనుష్యులు నన్ను పట్టుకుని వూరిబయట ఉరికంబం దగ్గరకు బయలుదేరతీశారు. వాళ్ళకు ఎంత నచ్చచెప్పినా వినకపోవటంవలన సంభాషణ ధోరణిమారుస్తూ_"మీకు జాతకంలో నమ్మకముందా?" అనడిగాను.

"ఓ!" అన్నారు ఇద్దరూ ఏకగ్రీవంగా.

"పిచ్చిగోల. జాతకం నిజంగా నమ్ముతున్నారా?" అంటూ వెకిలిగా నవ్వాను. దానితో వాళ్ళకు మహా కోపంవచ్చింది. "జాతకంనమ్మనంత మూర్ఖులుగూడవున్నారా ఈ భూప్రపంచంలో" అన్నాడు ఒకడు.

"మహా నమ్మకంవుందని చెపుతున్నారు. జ్యోతిష్కుడు వకసారి నా చెయ్యిచూచి మూడుహత్యలు చేస్తావని చెప్పాడు. చూడండి వకటిచెయ్యగానే ఉరితీయబోతున్నారు మరి. మిగతావి చెయ్యటానికి టైం ఎదీ చెప్పండి" అనడిగాను.

"నిజంగా..." వక్కసారి వణుకుతూ అన్నారు. మిగిలిన ఇద్దరూ వారేనని వారికి గూడా స్ఫురించినట్లువుంది. ఒక్కసారిగా నా చెయ్యివదిలి తలోదిక్కుకు పారిపోయారు. పోయినవారు పోయారుగదా అనుకుంటే ఇంకోనలుగుర్ని వెంటబెట్టుకుని మళ్లీవచ్చారు.

ఉరితీయటం సినిమాల్లో చాలా సార్లు చూశాను. ఉరితీసిన తర్వాత వాడికెల్లా వుంటుందో నిజంగా తీసుకున్న వాడిని అడుగుదామని అనిపించింది చాలాసార్లు. వాడు తిరిగి మాట్లాడలేడుగదా అని మళ్ళీ వూరుకున్నాను. ఇవ్వాళ స్వయంగా అనుభవించబోతూ ఈ ఆలోచన ఎందుకో. కీచురాళ్ళు కీ కీ మంటున్నాయి. గుడ్లగూబ వూరికే ఆగకుండా అరుస్తోంది. నా కుడికన్నో, ఎడమకన్నో (లక్షణశాస్త్రంబట్టి దుశ్శకునం ఏ కన్నయితే అది) అదురుతోంది. శకునాలన్నీ సరిగానే వున్నాయి. ఐతే ఉరితీయటం తప్పదన్న మాట.

అన్నిటితోపాటు విపరీతంగా వానకూడ ప్రారంభమయింది నా ప్రాణానికి. నాతోపాటు వస్తున్నవాళ్లు నన్ను చూసి చాలా చీకాకుపడుతున్నారు. నా మూలానగదా వాళ్ళకింత కష్టం. అసలే చలికాలం. సానుభూతిపూర్వకంగా వారివంక చూస్తూ "మరీ అంత చలిగావుంటే కాసేపాగిపోదా" మన్నాను.

"ఎంత ఆగితేమటుకేం? మళ్ళీ అక్కడినుంచి వచ్చినట్టు ఇంటికి పడిపోవద్దూ. ఈ గొడవంతా లేకుండా నీ పనే బాగా వుంది" అంటూ గట్టిగా మందలించాడు అందులోని ఒక ప్రబుద్ధుడు. అతని అవస్థకు మరింత జాలిపడి 'ఓసోను, పాపం' అన్నాను నిట్టూరుస్తూ. మళ్ళీ వాళ్ళేమీ మాట్లాడలేదు. గంభీరంగా వుంది వాతావరణమంతా. మేం వధ్యస్థానం చేరేటప్పటికి అక్కడి నక్కకూతలు బాగా వినపడుతున్నాయి. ఉరితీస్తే తీశారు వెధవలు. తరువాతన్నా నాదరిన నన్ను పోనిస్తే ఈ నక్కలబాధ తప్పుతుందిగదా అనుకున్నాను. అనుకోవటం ఐతే అనుకున్నాను. అమాత్రం దయ అందరికీ అంకురించాలిగదా మరి.

ఉరికంబం ఒక దిమ్మమీద వుంది. దాని మీద ఉరితాడు వేళ్ళాడుతోంది. దాన్ని చూడగానే మా కుక్కమెడకి రామిగాడు కట్టినతాడు గుర్తొచ్చి కళ్ళవెంబడి రెండు చుక్కలు వాటంతట అవే జారిపోయాయి. ఇంతలో ఒక పెద్దమనిషి నావంకకు తిరిగి "భగవంతుని ప్రార్థించుకొని ఆఖరి కోరిక ఏదైనావుంటే చెప్పుకో తీరుస్తా" మన్నాడు అధికారస్వరంతో.

"తప్పకుండానా?" అడిగాను.

"ఓ అంటూ ప్రతిధ్వని వచ్చింది. ప్రజాసమూహంనుంచి - ప్రజాసమూహమంటే తరువాతవచ్చారులెండి పెద్దలంతా వింతచూడ్డానికి.

"అలాగైతే నాకీ శిక్ష తీసెయ్యండి" అన్నా నా తెలివికి నాలో నేను మెచ్చుకుంటూ. అంతా విరగబడి నవ్వుతుంటే మొదట నామాటను విని అనుకున్నాను గాని అది నన్ను చూచి కాదని ఆ నవ్వువైఖరిని బట్టి తర్వాత తెలుసుకున్నాను. ఇందాకటి పెద్దమనిషి అందరినవ్వూ ఐపోయిన తర్వాత "అది కాకుండా ఇంకేదయినావుంటే కోరుకో ఊఁ..." అంటూ గద్దించాడు.

అప్పుడు నన్ను బాధిస్తున్నదల్లా నా బనీను. దాన్ని కుట్టించేటప్పుడు మా కాసింతో చెప్పనేచెప్పాను "నా తల పెద్దది—అంటే నా వుద్దేశంలో పై ఆకారం సుమండీ... మెడ ఖాళీ కొంచెం ఎక్కువగాపెట్టు"అని. అలాగయితే గుడ్డఎక్కువ పట్టుతుందని పెద్దదిగా కావలసింది ఖాళీ అయినా — కాస్త, గుడ్డ కుంగుతుందని కాస్తా చొక్కా బనీను కోసంతెచ్చిన గుడ్డను బనీనుకు సరిపెట్టాడు. తీరా బనీనుకోసం పోయినప్పుడు గుండీకాజా అంత మెడపెట్టి, తానేదో మందు వేయటం వలన ఘోరంగా గుడ్డకు దించుకుపోయిందనీ, ఇప్పుడు తల కొంచెం కష్టంగా దూరినా రానురాను లూజు ఔతుందనీ చెప్పాడు. వాడితో వాదించటంవలన కంఠశోష తప్ప ఉపయోగం ఉండదనీ అనుభవపూర్వకంగా తెలియటంవలన దణ్ణంవకటి వాడి మొహాన పారేసి వచ్చేశాను. ఇంతకీ చెప్పేదేమంటే ఇప్పుడు తొడుక్కున్నది ఆబనీనే. అదికుట్టిన రోజున నన్ను బల్లమీద కూర్చోబెట్టి కాజాలాంటి మెడలోనుంచి నా తలవెంట్రుకలను మొదట కొంచెంగాదూర్చి తలకాయను బలవంతంగా నలుగురుకలిసి బనీనులోకి దూర్చారు. అప్పటినుంచి దానిని విప్పదీయటానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలంగావటంవలన ఆ ప్రయత్నం మానుకున్నాను. ఆనాటినుంచీ స్నానంచేసినప్పుడల్లా అది ఆరటానికి ఎండలో నుంచోవాల్సివచ్చేది. ఆరి ఆరి అది మరీ బిగుసుకుపోయింది నా మెడకి. ఇప్పుడు అదీ బాధిస్తోంది. ఎంతకాలంనుంచో తీరని కోరికను తీర్చేవారున్నపుడు తీర్చుకోవటానికేమని బనీను బయటకు తీయవలసిందిగా ఆ పెద్దమనిషిని కోరాను. అది తీయలేరని నా గట్టి నమ్మకం. కాని ప్రజల్లోంచి వకడు అందించిన చాకుతో నా బనీనును బరబరా చించిలాగేశాడు. ప్రాణం వక్కసారి లేచి వచ్చింది. అమ్మయ్య అనుకుని "ఇప్పుడు ఉరితీసేయండి నాకేం భయంలేదు" అని ఆ పెద్దమనిషితో చెప్పాను. దానిని మెడకు తగిలించారు. కొబ్బరితాడులాగావుంది. మెడకు తగలగానే కొంచెం దురదపుట్టింది. కొద్దిగా గుచ్చుకున్నగూడా.

"ఇలా గుచ్చుకుంటుంటే ఎలా చావమంటారు, మీరు పోసుకొని చూడండి కావలిస్తే" అని ఛాలెంజిచేశాను ఆ పెద్దమనిషితో. అసలు ఉరిపోసుకు చచ్చేవాళ్ళంతా ఎలా చస్తారా అని అనుమానంవచ్చింది. వాళ్ళు గుడ్డతో పోసుకుచస్తారని గుర్తు రావటంవలన నాలో నేను సమాధానం పరుచుకున్నాను.

నా ఛాలెంజికి సమాధానం వస్తుందని ఆశపడ్డానుగానీ అటువంటిదేమీ జరగలేదు ఆట్టే వాగక ఆ పెద్దమనిషి సంజ్ఞచేసి నలుగురి సహాయంతో ఉరితాడు పైకిలాగాడు. చాలా భయంవేసింది. నేరం చేయనివాడిని యింత అన్యాయం చేస్తారా! నేను చేసింది నేరం కాదని రేపు తేలితే నష్టపరిహారం ఏం యివ్వగలరు! ప్రాణం తీసినంత తేలిగ్గా యివ్వగలుగుతారా! చవటలు...మందబుద్ధులు...వె...ధ...మాట పూర్తి కాకముందే ఉరి బిగుసుకుపోయింది. బలే భయంవేసింది. 'ఆ' అంటూ బిగ్గరగా గావు కేకపెట్టాను.

"ఏంటండీ మరీను పొలికేకలు. పిల్లలు ఝడుచుకోరూ" అంటూ మా ఆవిడ మృదుమధురంగా మందలించింది.

నిద్రకళ్ళను తుడుచుకుంటూ 'కోడిగుడ్డూ వద్దు, దాని యిదీవద్దు. పాలే తీసుకురమ్మని బాపమ్మతో చెప్పు' అన్నాను ఆవలిస్తూ.